# ★ ప్రతీకారం ★

ఆశాలత పాల్

నేను సుందర్రావుకు చేసిన ప్రతీకారము జ్ఞాపకము వస్తే నాకు ఇప్పటికీ నవ్వువస్తూంటుంది. నేను కాలేజీలో చదివేటప్పుడు సుందర్రావు నా క్లాసుమేటు. అతను ఎప్పుడూ 'టకప్' లో క్లాసుకు తయారయ్యేవాడు, చాలా గర్వంగా మాట్లాడేవాడు. అతని 'డ్రస్సు' ను చూచి మేము ధనికుడనుకునేవాళ్ళము చదువులోకూడ అతన్ని మేమొక మేధావిగా భావించే వాళ్ళము.

ఒకనాడు మా 'కెమిష్ట్రి ప్రొఫెసర్' 'స్లిప్ టెస్ట్' ఉంటుందని తెలియ చేశారు. ఆ తరువాత రోజు నేను సుందర్రావుతో "కెమిష్ట్రి ఎంతసులువురా. రాత్రి ఓమూడు గంటలు పుస్తకం చదివేటప్పటికి కోర్సుఅంతా కంఠతా అయిపోయింది" అని అన్నాడు.

కెమిష్ట్రి పేపర్లు దిద్ది మాకిచ్చేశారు, నేను నా మార్కులు కూడుకుంటూ 'హాలు' బయటికి వస్తున్నాను. ఇంతలో సుందర్రావు తన పేపరు చేతిలో పట్టుకొని వాప్పైపు వెనుక తిరిగి ఏమో ఆలోచిస్తున్నాడు. నేను నెమ్మదిగా అతని వెనక్కుజేరి అతని మార్కులు చూచి ఆశ్చర్యపోయాను. 'ఏడూ బై నూరు' అని వుంది. మాట్లాడకుండా తప్పుకున్నాను. తరువాత రోజు వెంకట్రావు సుందర్రావును "స్లిప్ టెస్టులో ఎన్ని మార్కులు వచ్చాయిరా?" అని అడిగాడు, వాడు "సెవెంటీ పర్సెంటురా!" అని గంభీరంగా అన్నాడు, నేనుకొంచెం ఆశ్చర్య పడ్డాను. తప్పు చూడలేదుగదా? ఏడుప్రక్క సున్నానిమాద్దం మర్చిపోయానేమో?

ఒకనాడు మేమందరం కలిసి 'హాస్టలు' భోజనాన్నిగూర్చి తర్కించుకొంటున్నాము ఇంతలో సుందర్రావు....

"ఎలాగరా మీరు ఆ మెతుకులు తినగల్గుతారు? నేను మొన్న ఒకరెస్టారెంటుకి వెళ్లాను భోజనం చేయాలంటే అక్కడే చేయాలి" అని అన్నాడు. నా ప్రక్కన కూర్చున్న సూర్రావు "నీవంటే గొప్పవాడవు. ఎక్కువ డబ్బిచ్చి మంచి భోజనం చేస్తావు. మాకెక్కడిది డబ్బు?" అని విడిచాడు. "డబ్బుకేం ఉందిరా? రూపాయి పారేస్తే ప్లేటు పులావు వస్తుంది" అని సమాధానం చెప్పాడు. నేను ఊరుకోక "పోనీ యిన్ని మాటలు చెప్పిన వాడివి ఒకసారి అక్కడికి తీసికెళ్ళకూడదురా!" అని కొట్టాను తైరు.

"దానికేం! మీరంతా ఒకసారి రండి" నేను తీసికెళ్తాను" అన్నాడు.

కాని ఇలాగ రెండు నెలలు గడిచాయి. మేము ఎన్నిసార్లు సుందర్రావు నడిగినా "ఇదిగో ఈవాళ మామామ ఒకరు కలకత్తా నుంచి వస్తున్నాడు. అందుకు స్టేషనుకు వెళ్ళాలిరా" "ఇదిగో మా అక్కయ్య ఢిల్లీ లో వుంది. మా బావమిలిటరీ కర్నెల్, టెలిఫోనులో మాట్లాడాలి. అర్జంటురా" అంటూ తప్పుకుపే వాడు.

ఒకరోజున మాకు శెలవు వచ్చింది, శెలవుకు కారణం జ్ఞాపకం లేదుగాని, ప్రొద్దున్న క్లాసులు జరిగేక మధ్యాహ్నానికి శెలవిచ్చారు, అప్పుడు ఒంటి గంటవుతుంది. నేను సూర్రావు కాలేజీ

గేటుదగ్గరకు వచ్చాక సుందర్రావు మాట జ్ఞాపక మొచ్చింది, పట్టుకున్నాం సుందర్రావుని వెళ్ళి.

వాడు "ఇప్పుడెలాగురా? నాకుకొంచెం పని వుంది. మాపినతండ్రి ఇప్పుడే లండన్‌నుండి "

"నాకదంతా తెలియదు. నీవు మమ్మల్ని తీసి కెళ్ళక తప్పదు" అన్నాను నేను.

ఇక చేసేదిలేక వాడు మనల్ని తీసుకొని బయలు దేరాడు" ఇంత ఎండలో నడవడమే? టాక్సీలో పోదాం పద" అని ఓటాక్సీ పిలిపించి మమ్మల్ని ఎక్కించాడు. నాకు "జల్సాపురుషు డంటే వీడురా" అనిపించింది. రెస్టారెంటు దగ్గరదిగి డ్రైవరుతో "కొంచెం ఆగాలి. మమ్మ ల్ని ఇంటికి తీసికెళ్ళవుగాని" అని చెప్పాడు. మేము లోపలికెళ్ళి కూర్చున్నాము. సుందర్రావు మమ్మల్ని అడిగి నాల్గయిదు రకాలు "ఆర్డర్" ఇచ్చాడు. సూర్రావు బుర్ర వంచుకొని అంతా తినేస్తున్నాడు. నాకువాడి వాలకంచూచి సిగ్గేసింది సుందర్రావు మాత్రము ఏమీ తినలేదు

"మీరు తినండి. నేనెప్పుడు తినేవే యివి" అని అన్నాడు. కొంతసేపయేటప్పటికి సుంద ర్రావు లేచి "నేనిక ఆలస్యము చేయనురా. నాకు చాల అర్జెంటు పని వుందిరా" అంటూ వెళ్ళి పోయాడు. వాడు వెళ్ళిపోయాక సూర్రావు ప్లేటు ఖాళీచేసి" అరే! వాడు వెళ్ళిపోయాడే? ఉండు! నేను వాణ్ణి పట్టుకు వస్తాను" అని పోయాడు, కొంతసేపటికి బిల్లువచ్చి నాచేతులో పడింది దానిని చూచి నేను తుళిక్కిపడ్డాను. రు 8-4-6 పైసలే! జేబులో చెయిపెట్టిచూస్తే అర్ధరూపాయి మాత్రమే వుంది, ఇంకేం చేసేది ఏం చెప్పేది? మేనేజరు దగ్గర చేతి ఉంగరం తాకట్టుపెట్టి బయ టకు వచ్చేటప్పటికి డ్రైవరు ప్రత్యక్షము. "బాబు అరగంట సేపాగేనండీ. ఛార్జీ ఎక్కువవుతుంది" అన్నాడు. నేను లోపలికిపోయి మేనేజరుదగ్గర నాపెన్నుకూడా పెట్టి రెండు రూపాయలు వాడి కిచ్చేసాను, "ఎవరయ్యా డబ్బులేకుండా టాక్సి ఎక్కి పులావు తినమనాడు?" అని మేనేజరు విసుక్కున్నాడు. నాకప్పుడు పులావేంటి? ఎప్పు డు సుందర్రావు ఎదురు పడ్తాడా, ఎప్పుడు వాణ్ణి మెత్తగా తందామూ అని వుంది.

తరువాత రోజు కాలేజిగేటు దగ్గర సుంద రావు దర్శనం.

"ఏంరా! ఎలాగ వుంది పులావు?" అని నవ్వుతూ అడిగాడు. నేను చెయ్యి ఎత్తబోయి కూడ మానివేశాను" సరే? వీడ్ని ఇప్పుడు కొట్టి ఏంలాభం. ఒకరోజున వీడికి ఆ అనుభవం చేస్తే నే గాని తెలియదు, బుద్ధిరాదు" అని నా మన స్సులో అనుకున్నాను

తరువాత చాలరోజులు గడచి పోయాయి. నాకు కొత్తగ కలకత్తా జాబ్ దొరికింది. క్రొత్త పట్టణం క్రొత్త ఆచారాలూ చూడవచ్చునను కొంటూ స్టేషనుకి చేరాను,

"ఏమండీ! సెకెండ్ క్లాస్ కలకత్తా టికెట్" అంటూ" చేయి చాపేటప్పటికి వెనుకనుండి ఎవరో "అరే! పాల్! నీవెక్కడికి తయారు?" అన్నారు. నేను వెనక్కి తిరిగి చూచేటప్పటికి సుందర్రావు కనబడ్డాడు.

"నేను కలకత్తాకి వెళ్తున్నానురా, మరి నీ వెక్కడికి?" అని ప్రశ్నించాను.

"వాల్తేరునకు" అన్నాడు-

"అయితే ఇద్దరు కలిసి వెళ్ళవచ్చును. అదే దారిగా"

"ఏది ఏక్లాసురా?"

"థర్డ్ క్లాసురా - అర్జంటు పనివుంది డబ్బు తీసుకోడానికి కూడ టైము లేకపోయింది" వీడికింకా ఆ 'అర్జెంటు' 'టైములేకపోవడం' రోగాలు వదలలేదని నాలో నేను నవ్వుకొన్నాను.

"దానికేంలేరా? డబ్బునేనిస్తానుగా- తరువాత నీవు యం. ఓ. లో పంపవచ్చు" నని వాడిటికెట్ సెకండ్ క్లాసుకి మార్చాను,

మేమిద్దరం రైలు యెక్కగానే "నీవు కలకత్తాలో యెక్కడ వుండేది? హొటేలులోనా?" అని సుందర్రావు అడిగాడు.

"అవునురా అక్కడ యిల్లు దొరకడం చాలా కష్టం. అవును అన్నట్లు, మీ అక్కయ్యను కొంచెం సాయం చేసి పెట్టమన్నా నాకు హోటలులో వుండడం అలవాటులేదు."

"నాకు అక్కయ్యలున్నారని నీకెవరు చెప్పారు? మానాన్నకి నేను ఒక్కడినేగా"

"నువ్వేగదురా చెప్పావు. ఒకసారి ఏదో అర్జంటు పని మీద మీబావగారికి —"

"ఆ! ఆ! ఆవిడ మా సొంతక్కయ్యకాదులే. ఆవిడ భర్త కలకత్తాలో ఒక పోలీసు సర్జెను"

"మరి, మిలిటరీ కర్నెల్ అన్నావు?"

"ఎవరు నేనా? ఆ! అవును! ఆయన పని మానేసి యిప్పుడు పోలీసు సర్జెను అయ్యాడు" అన్నాడు సుందర్రావు.

"వీడికింకా గర్వం తగ్గలేదు" అని మనస్సులో అనుకున్నాను.

కొంత సేపటికి సుందర్రావు పర్సు జేబులో సరిగా వుందో లేదో చూసికొని పడుకున్నాడు.

వాడు నిద్రపోయాక నేను కాగితము, పెన్ను ట్రంకులోంచి తీసాను, తరువాత నేను కూడా నిద్ర పోయాను. ఎంతసేపు నిద్రపోయానో తెలీదుగాని "టికెట్ సార్! టికెట్ సార్" కేకలు విని లేచాను. నా టికెట్ట్ చూసేసి, 'చెక్కరు' సుందర్రావు దగ్గరకు వెళ్ళాడు. వాడు పర్సు, జేబులన్నీ వెతకడం మొదలు పెట్టాడు. ఎంతకీ టికెటు బయలు పడలేదు. చెక్కర్ చీవాట్లు వేశాడు. తరువాత ఇంకే ఉంది! తరువాత స్టేషనులో సుందర్రావుగారు ఊడ్చబడ్డారు క్రిందికి. నేను గుండె మీదనుంచి బరువు తేసి వేసినట్లుగా 'ఫీల్' అయ్యాను.

వారంరోజులు అయాక వాడి దగ్గర్నుంచి 'లెటరు' వచ్చింది. డియర్ పాల్, "నీవు ఏలాగైతేనేం, నామీద పగతీర్చుకున్నావు నిన్ను అప్పుడు ఎటువంటి అవస్థలో పెట్టానో దానికి పదిరెట్లు అవస్థ నేను పడ్డాను. రైలు కదిలాక ఏంజరిగిందనుకున్నావు? నేను 'దొంగ' 'వెధవ' ఇలాంటితిట్లు యెన్నో తిన్నాను. ఏలాగ విడిపించాననుకున్నావు? సమాధానం వ్రాయాలంటే ఏడ్పు వస్తుంది - నన్ను మా మామగారు రక్షించారు. ఆయన నన్ను తీసికెళ్ళడానికి స్టేషనుకు వచ్చారట. ఎంతకీ నేను కనబడక పోవడంవల్ల 'ప్లాట్‌ఫారం' టికట్ పుచ్చుకొని నాదగ్గరకు వచ్చారు. నన్నావస్థలో చూచి ఆశ్చర్య పోయారు. ఏలాగైతేనేం ఆయన నన్ను రక్షించాడు. ఇంటికి చేరాక నాభార్య తలగడగవీబుతీస్తూ 'ఏమండోయ్! ఇందులో వుంది. టికెట్‌నూ, ఇంకో కాగితంనూ' అంటూ నీవు వ్రాసిన లెటరు కూడ యిచ్చింది. ఇంకేం! అల్లుడుగారు టికెట్ దాచుకొని తన్నులు తిన్నారన్న సంగతి ఇంట్లో పి. టి. ఐ. అయింది. మొత్తంమీద నాకు మంచి బుద్ధినిచ్చావు" ఇట్లు సుందర్రావు, అప్పటినవ్వు యిప్పటికీ వుంది!

★

ఆనందవాణి
పోస్టుబాక్సు నెంబరు
1583
—మేనేజరు